నమస్తే తెలంగాణ
# వికారాబాద్
I హైదరాబాద్, ఆదివారం 26 జనవరి 2025 | VIKARABAD



వ్యవసాయ ఉత్పత్తుల మద్దతు ధరల పట్టీతో రైతుల రాస్తారోకో

# రోడ్డెక్కిన వేరుశనగ రైతు

- మద్దతు ధర ఇవ్వాలని రైతుల డిమాండ్
- ఒక వారంలోనే రూ.2వేలు ఎలా తగ్గుతున్నదని నిలదీత
- జాతీయ రహదారిపై ఆందోళనతో రెండు గంటలపాటు నిలిచిన వాహనాలు

పరిగి, జనవరి 25 : ఆరుగాలం కష్టపడి పండించి మార్కెట్‌కు తీసుకొస్తే వ్యాపారులు సిండికేట్‌గా మారి, అధికారులతో కుమ్మక్కై ఒక వారం తేడాలోనే క్వింటాలుకు రూ.2 వేలు తక్కువ చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ వేరుశనగ రైతులు రోడ్డెక్కారు. జాతీయ రహదారిపై రెండు గంటల పాటు ఆందోళన చేసిన రైతులు మార్కెట్ యార్డులో దుకాణాలను మూసివేయించి మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ముట్టడించారు. వివరాల్లోకి వెళ్తే.. పరిగి మార్కెట్ యార్డుకు వేరుశనగ విక్రయించేందుకు పరిగి, బొంరాస్‌పేట మండలాల నుంచి శనివారం అధిక సంఖ్యలో రైతులు వచ్చారు. శుక్రవారం ఆన్‌లైన్ ఇబ్బందులతో టెండర్లు జరగకపోగా శనివారం ఆన్‌లైన్ టెండర్లు వేసిన వ్యాపారులు కుమ్మక్కై గత వారంతో పోలిస్తే క్వింటాలుకు రూ.2వేలు తక్కువగా కోట్ చేశారు. కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.6783 ప్రకటించగా, గత శుక్రవారం పరిగి మార్కెట్‌లో రూ.6500 వరకు విక్రయింపబడింది. ప్రభుత్వం ప్రకటించిన ధర కంటే సుమారు రూ.300 తక్కువకు వ్యాపారులు కొనుగోలు చేసినా రైతులు వేరుశనగ విక్రయించారు. కాగా, శనివారం వ్యాపారులు సిండికేట్‌గా మారి వేరుశనగకు తక్కువ కోట్ చేశారు. సుమారు 800 లాట్స్‌కుగాను ఆన్‌లైన్‌లో 50కి పైగా లాట్స్‌కు కనీసం ఒక్క టెండర్ కూడా దాఖలవకపోగా 150 లాట్స్‌కు తక్కువ ధర వేసినట్లు అధికారులే చెబుతున్నారు. సరాసరిన శనివారం అత్యధిక రైతుల వేరుశనగకు రూ.4500 ధర వేశారని పేర్కొంటూ రైతులు ఆగ్రహంతో ఆందోళనకు దిగారు. మార్కెట్ యార్డు నుంచి హైదరాబాద్–బీజాపూర్ జాతీయ రహదారి వరకు ర్యాలీ చేపట్టి రోడ్డుపై బైఠాయించారు. సుమారు 2 గంటలపాటు రహదారిపై రాస్తారోకో చేయడంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. పరిగి ఎస్‌ఐ సంతోష్‌కుమార్, పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించారు. జాతీయ రహదారిపై ఆందోళన చేస్తే కేసులవుతాయని, మార్కెట్ యార్డుకు వెళ్లాలని పోలీసులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా ఆందోళన కొనసాగించారు. అనంతరం మార్కెట్ యార్డుకు వెళ్లి దుకాణాలను మూసి వేయించారు. ఏ ఒక్కరూ వేరుశనగ కొనరాదని, కనీస మద్దతు ధర ఇస్తేనే కొనాలంటూ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని ముట్టడించారు. మరోసారి టెండర్ దాఖలుకు అవకాశం ఇచ్చామని మార్కెట్ కార్యదర్శి చెప్పగా ఒక్క వారంలోనే ధరలు ఎందుకు తగ్గాయంటూ రైతులు ప్రశ్నించారు. సమస్యకు పరిష్కారం లభించకపోవడంతో రైతులు మరోసారి జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకొని రైతులను సముదాయించి మార్కెట్ యార్డుకు తీసుకెళ్లారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి తక్కువ ధర కోట్ చేస్తున్నారని ఆరోపించారు. తక్‌పట్టీలు ఇవ్వడం లేదని రైతులు తెలిపారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఎస్‌ఐ సంతోష్‌కుమార్ రైతులు, మార్కెట్ కమిటీ కార్యదర్శితో మాట్లాడారు. రీటెండర్‌లో అధిక ధర వస్తే రైతులకు ఇష్టం వస్తే విక్రయించాలని, లేదంటే సోమవారం ప్రభుత్వం ద్వారా కొనుగోలు చేసేలా చూస్తామని ఎస్‌ఐ, మార్కెట్ కార్యదర్శి హామీ ఇచ్చారు. అనంతరం పరిగి మార్కెట్ కమిటీకి వచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాంరెడ్డి రైతులతో మాట్లాడి రైతులు కోరుకున్న ధర రాకుంటే సోమవారం ప్రభుత్వం ద్వారా కొనుగోలు జరిగేలా చూస్తామని చెప్పారు.

### వారంలోనే ధర తగ్గుతుందా..



గత వారం క్వింటాలుకు రూ.6500లకు వేరుశనగ పరిగి మార్కెట్‌లో అమ్ముడైతే, ఈ వారం ఒక్కసారిగా రూ.2000 ఎలా తగ్గుతుంది. వ్యాపారులు, అధికారులు కుమ్మక్కై ధరలు తగ్గిస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు వేరుశనగ కొనుగోలు చేయాలి.

– పొడల రాములు, రైతు, వడిచెర్ల

### పథకాల అమలు శూన్యం..



ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు పేదలకు అన్నింటా సంక్షేమ పథకాలు అందిస్తామని చెప్పారు. ప్రజాపాలన కార్యక్రమంలో రేషన్ కార్డు, ఇందిరమ్మ ఇల్లు, రైతు భరోసా వంటి పథకాలకు దరఖాస్తు చేసుకున్నా. ప్రస్తుతం ప్రభుత్వం విడుదల చేసిన జాబితాలో ఏ ఒక్క పథకానికి పేరు లేదు. ఎన్నికల్లో చెప్పినట్లు అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికీ పథకాలను మంజూరు చేయాలి.

– రాజశేఖర్, పాత కొడంగల్, కొడంగల్

### ఏ ఒక్క పథకమూ రాలేదు..



ప్రజాపాలనలో ప్రస్తుతం అమలు చేస్తామన్న 4 పథకాలకు నేను దరఖాస్తు చేసుకున్నా. కానీ జాబితాలో ఏ ఒక్క పథకంలో పేరు రాలేదు. అర్హత ఉన్నప్పటికీ పథకానికి ఎంపిక చేయకపోవడం అధికారుల తప్పా.. లేక ప్రభుత్వం తప్పా తెల్వదు. జాబితాల్లో చాలా మంది పేర్లు లేవు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటున్నారు. అప్పుడు దరఖాస్తు చేసుకున్నవి ఏమైనట్లో తెల్వదు. మళ్లీ దరఖాస్తు చేసుకున్నా వస్తాయనే ఆశ లేదు.

– పీ వెంకటయ్య, పాత కొడంగల్, కొడంగల్

వికారాబాద్ జిల్లాలోని దోమ మండల కేంద్రంలో నాలుగు పథకాల అమలు కోసం శనివారం రాత్రి సర్వే చేస్తున్న అధికారులు



కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాలకు భారీగా దరఖాస్తులు

అర్హుల ఎంపికపై ప్రభుత్వం నుంచి రాని స్పష్టత

గ్రామ సభల్లో అర్హుల్లో కొంత మందినే ఎంపిక చేసిన జిల్లా యంత్రాంగం

నేడు నాలుగు పథకాల ప్రారంభం

మా సంగతేందని ప్రశ్నిస్తున్న అర్హులు

కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాలకు 96,423 దరఖాస్తులు

# హామీలన్నీ డ్రామాలేనా?

## లక్షకు చేరువలో దరఖాస్తులు..

## లక్ష్యానికి దూరంగా అర్హులు

వికారాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం నేడు ప్రారంభించాలని నిర్ణయించిన రైతు భరోసా, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు కేవలం కొంత మందిని మాత్రమే ఎంపిక చేసి అర్హులైన సుమారు లక్ష మందికి అన్యాయం చేసింది. నాలుగు పథకాలకు ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను వెల్లడించేందుకు నిర్వహించిన గ్రామ, వార్డు సభల్లో దరఖాస్తుల స్వీకరణతో ముగిసింది. రైతు భరోసా, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకాలకు గ్రామ, వార్డు సభలకు ముందే లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ సంబంధిత లబ్ధిదారుల జాబితాలో కొత్త రేషన్‌కార్డుల కోసం, ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న అర్హులు చాలా మంది ఉండడం, వారి నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారు. జిల్లావ్యాప్తంగా నాలుగు పథకాలకుగాను అధికారులు ఎంపిక చేసిన జాబితా కాకుండా కొత్తగా సుమారు లక్ష మంది అర్హులు దరఖాస్తు చేసుకున్నారు. గ్రామ, వార్డు సభల్లో అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరించారే తప్ప సంబంధిత దరఖాస్తులకు సంబంధించి పరిశీలన ప్రక్రియ, అర్హుల ఎంపిక ప్రక్రియ ఎప్పుడు చేస్తారు, ఎప్పుడు సంబంధిత పథకాల ప్రయోజనం అందిస్తారనే దానిపై ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పష్టత లేదు. ఇదే విషయమై సంబంధిత అధికారులను వివరణ అడుగగా.. దరఖాస్తుల స్వీకరణ వరకే మా బాధ్యత.. దరఖాస్తుల పరిశీలనతోపాటు అర్హుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం నుంచి విధివిధానాలు రావాల్సి ఉన్నదని అధికారులు వెల్లడించారు. ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక బాధ్యత ఇందిరమ్మ కమిటీలకు అప్పగించడం, ఆ కమిటీల్లో కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే ఉండడంతో లబ్ధిదారుల జాబితాలోనూ కేవలం కాంగ్రెస్ పార్టీకి చెందిన వారినే ఎంపిక చేయడంపై సర్వత్రా ఆరోపణలు వస్తున్నాయి. సబ్బండ వర్ణాలకు అందించాల్సిన సంక్షేమ పథకాల ఫలాలను ఒక్క పార్టీకి చెందిన వారికే అందించేలా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుండడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోవైపు కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకుగాను అర్హులైనప్పటికీ నామమాత్రంగా దరఖాస్తులు స్వీకరించి విస్మరిస్తుండడంపై ప్రభుత్వం క్లారిటీ ఇవ్వాలని దరఖాస్తుదారులు డిమాండ్ చేస్తున్నారు.

## ఆయా పథకాలకు 96,423 అప్లికేషన్లు..

రైతు భరోసా, ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పథకానికిగాను అధికారులు ఇప్పటికే ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాలో సగానికిపైగా అర్హులకు అన్యాయం చేయడంతో గ్రామ, వార్డు సభల్లో భారీగా దరఖాస్తు చేసుకున్నారు. జిల్లావ్యాప్తంగా ఈ నాలుగు పథకాలకుగాను ఈ నెల 24 వరకు అర్హులైన వారి నుంచి కొత్తగా 96,423 దరఖాస్తులు అందినట్లు అధికారులు వెల్లడించారు. కేవలం 23,542 మందికి కొత్త రేషన్ కార్డులను జారీ చేసి చేతులు దులుపుకుందామనుకున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు షాకిచ్చారు. జిల్లావ్యాప్తంగా నిరసనలు వ్యక్తం కావడంతో మళ్లీ దరఖాస్తులను స్వీకరించారు. కొత్త రేషన్ కార్డుల కోసం జిల్లావ్యాప్తంగా 58,784 దరఖాస్తులు రావడం గమనార్హం. ఇందిరమ్మ ఇండ్ల కోసం 26,312 దరఖాస్తులు, రైతు భరోసాకు 3745 దరఖాస్తులు, ఆత్మీయ భరోసాకు 7582 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు.

### మళ్లీ దరఖాస్తు చేసుకోమనడం మోసం..



జాబితాలో పేరు రాని వాళ్లు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం మోసం. మేము ఎలా అనర్హులమో గ్రామసభల్లో తెలుపాల్సి ఉండే. ఎన్నికల కోసమే ఆర్భాటం చేస్తున్నారని అర్థమవుతున్నది. అర్హులకు న్యాయం చేస్తున్న కాంగ్రెస్‌కు రాబోవు రోజుల్లో గుణపాఠం తప్పదు.

– రవికుమార్, బషీరాబాద్ మండలం

### ఎన్నో ఆశలతో దరఖాస్తు చేశా..



మా తల్లిదండ్రులకు ముగ్గురం అన్నదమ్ములం. నాకు, తమ్ముడికి పెండ్లిళ్లు అయ్యాయి. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో కొత్త రేషన్ కార్డులు ఇస్తామని చెప్పడంతో ఇద్దరం దరఖాస్తు చేసుకున్నాం. ఎన్నో ఆశలు పెట్టుకుంటే జాబితాలో మా పేర్లు రాలేదు. ఇచ్చిన మాట నిలబెట్టుకోకపోతే ప్రజల నుంచి తిరుగుబాటు తప్పదు.

– రాజు, దామర్‌చేడ్ గ్రామం, బషీరాబాద్

### ఇందిరమ్మ ఇల్లు కోసం దరఖాస్తు చేసుకున్నా..



కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇండ్లు ఇస్తామని ఎన్నికలకు ముందు చెప్పింది. ఆ నమ్మకంతోనే కాంగ్రెస్ పార్టీకి ఓటు వేశాం. మాకు స్థలం ఉన్నది. మా ఇంట్లో ఏడుగురం సభ్యులం ఉంటాం. ఇల్లు సరిపోవడం లేదు. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నా. లిస్టులో మా పేరు రాలేదు. ఇందిరమ్మ ఇల్లు వస్తే మాకు కొంత మేలు జరుగుతుంది.

– అజీజ్‌మియా, కల్కోడ, మర్పల్లి



ఎల్ ఆర్ఎస్ దరఖాస్తుదారులకు అడుగడుగునా తిప్పలు..

జిల్లావ్యాప్తంగా పెరిగిపోతున్న పెండింగ్ దరఖాస్తులు

## మూడు శాఖల మధ్య

# ముప్పతిప్పలు

*ఎల్ఆర్ఎస్ ద్వారా రెగ్యులరైజ్ చేసుకునే దరఖాస్తుదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా తక్షణమే ఎన్‌వోసీలు ఇవ్వాలని, తద్వారా ప్రభుత్వ ఆదాయం పెంచేందుకు ప్రభుత్వం ఆదేశాలిస్తుండగా, మరోవైపు క్షేత్రస్థాయిలో దరఖాస్తుదారులకు తిప్పలు తప్పడం లేదు. పలు వెంచర్లలో రూ.వెయ్యి చెల్లించి పెండింగ్‌లో ఉన్న ఎల్ఆర్ఎస్ ప్లాట్లను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ప్లాట్ల యజమానులకు ప్రభుత్వం రెగ్యులరైజ్ చేసుకునే అవకాశం కల్పించింది. దీంతో జిల్లావ్యాప్తంగా వేలాదిమంది తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవడం కోసం దరఖాస్తులు చేసుకున్నారు. హెచ్ఎండీఏ పరిధిలో ఉన్న అన్ని మండలాల్లో ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు వీలు కల్పించారు. ముఖ్యంగా రంగారెడ్డి జిల్లాలో 21 మండలాలు, 13 మున్సిపాలిటీలు ఉన్నాయి. ఇందులో అన్ని మున్సిపాలిటీలు కూడా హెచ్ఎండీఏ పరిధిలోనే ఉన్నాయి. 11 మండలాలు కూడా హెచ్ఎండీఏ పరిధిలోనే ఉన్నాయి. దీంతో ఆయా వెంచర్లలో రిజిస్ట్రేషన్ కాకుండా మిగిలిపోయిన వెంచర్లకు రూ.వెయ్యి చెల్లించి రెగ్యులరైజ్ చేసుకోవడం కోసం ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ అవకాశం మేరకు జిల్లావ్యాప్తంగా వేలాది మంది ప్లాట్ల యజమానులు తమ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకుని ఇల్లు నిర్మించుకోవడంతో పాటు రుణాలు తీసుకోవడం కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును పరిశీలించి తద్వారా వాటిని రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.*

*- రంగారెడ్డి, జనవరి 25 (నమస్తే తెలంగాణ)*

### తలనొప్పిగా మారిన టౌన్‌ప్లానింగ్ అధికారుల కొరత..

హెచ్ఎండీఏ పరిధిలో ఎల్ఆర్ఎస్ కాని ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవడం కోసం ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు మున్సిపల్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఆయా మున్సిపాలిటీల్లో వెయ్యి రూపాయలు చెల్లించి ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు స్థానిక మున్సిపాలిటీలు, మండలాల్లో దరఖాస్తులు చేసుకున్నారు. దరఖాస్తులను పరిశీలించడం కోసం మున్సిపాలిటీల్లోని టౌన్‌ప్లానింగ్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలు క్షేత్రస్థాయిలో పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, మున్సిపాలిటీల్లో టౌన్‌ప్లానింగ్ అధికారుల కొరత తీవ్ర తలనొప్పిగా మారింది. ముందుగా టౌన్‌ప్లానింగ్ అధికారులు ప్లాటు వద్దకు వెళ్లి లొకేషన్ చూసిన తర్వాత ప్లాట్ సమీపంలో చెరువులు లేవని ఇంటి నిర్మాణానికి ఎలాంటి ఇబ్బంది లేదని రెవెన్యూ యాప్‌లోకి అప్‌లోడ్ చేస్తారు. ఆ తర్వాత ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు కూడా ప్లాటు ప్రాంతాన్ని సందర్శించి అనుమతులివ్వాల్సి ఉంటుంది. కాని, ఈ శాఖల మధ్య సమన్వయ లోపంతో ఎల్‌వోసీలు జారీ చేయడానికి తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఎలాంటి నీటి వనరులకు దగ్గరలో లేకపోయినా ప్లాట్ల విషయంలో కూడా ఎన్‌వోసీ ఇవ్వడానికి ఈ మూడు శాఖల అనుమతులు తప్పని సరి కావడం వల్ల ప్లాట్ల యజమానులు తీవ్రంగా ఇబ్బందులకు గురవుతున్నారు.

### శాఖల మధ్య సమన్వయ లోపం..

ప్లాట్లకు, ఇండ్ల నిర్మాణానికి ఎన్‌వోసీలు ఇచ్చే విషయంలో శాఖల మధ్య సమన్వయ లోపం దరఖాస్తుదారులకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. ఇరిగేషన్ ఏఈ, రెవెన్యూ శాఖ ఆర్ఐలు, మున్సిపాలిటీల్లో టౌన్ ప్లానింగ్ అధికారులకు ఎన్‌వోసీలకు అనుమతి బాధ్యతలు అప్పగించింది. కానీ, ఆయా శాఖల అధికారులు వివిధ పనుల్లో తలమునకలై ఉన్నందున ఈ అనుమతుల విషయంలో శ్రద్ధ చూపడం లేదు. దరఖాస్తు దారులు మూడు శాఖల అధికారుల వద్దకు తిరిగి వారిని కలువడానికే సుమారు నెల రోజులు పడుతున్నది. అయినప్పటికీ అధికారులు స్పందించకపోవడం వల్ల చేతులు తడపక తప్పడం లేదని ఆరోపణలున్నాయి.

### జిల్లావ్యాప్తంగా వేలాది దరఖాస్తులు పెండింగ్..

జిల్లాలో అత్యధిక శాతం మండలాలు, మున్సిపాలిటీలు హెచ్ఎండీఏ పరిధిలోనే ఉన్నాయి. నగర శివారుల్లో విస్తరించి ఉన్న రంగారెడ్డి జిల్లాలో 13 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్లు, సుమారు 11 మండలాలు హెచ్ఎండీఏ పరిధిలో ఉన్నాయి. ఈ మండలాల్లో ఎల్ఆర్ఎస్ లేకుండా అనేక ప్లాట్లు ఉన్నాయి. ఈ ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకోవడం కోసం ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కానీ, ఎన్‌వోసీల అనుమతి విషయంలో మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు విచారించిన తర్వాతనే అనుమతులు తప్పని సరి చేసింది. ఈ నేపథ్యంలో ఆయా అధికారులు సకాలంలో స్పందించకపోవడం వల్ల లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

### సమన్వయ లోపంతో సకాలంలో జారీకాని ఎన్‌వోసీలు..



ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారుల సమన్వయ లోపంతో ఎన్‌వోసీలు సకాలంలో జారీ కావడం లేదు. నెలల తరబడి ఆఫీసులు చుట్టూ తిరుగుతున్నా పనులు కావడం లేదు. ప్లాట్లను రెగ్యులరైజ్ చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా కిందిస్థాయి అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు.

– మూర్తి జంగారెడ్డి, రాయపోల్



## నేటితో మున్సిపల్ పాలకవర్గాల

# పదవీ కాలం ముగింపు

త్వరలోనే 13 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్లకు ప్రత్యేకాధికారులు

మున్సిపాలిటీల్లో ఘనంగా పాలకవర్గాలకు వీడ్కోలు



రంగారెడ్డి, జనవరి 25 (నమస్తేతెలంగాణ) : జిల్లాలో మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పాలకవర్గాల పదవీకాలం నేటితో ముగియనున్నది. 13 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్లల్లోని పాలకవర్గాలను అధికారులు ఘనంగా సన్మానిస్తున్నారు. బడంగ్‌పేట, మీర్‌పేట్ కార్పొరేషన్ల పాలకవర్గాల పదవీకాలం కూడా ఆదివారంతో ఐదేండ్లు నిండనున్నాయి. ఆయా మున్సిపాలిటీల చైర్మన్లు, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లను అధికారులు సన్మానిస్తున్నారు. హైదరాబాద్ శివారుల్లోని ఇబ్రహీంపట్నం, పెద్దఅంబర్‌పేట, తుర్కయాంజాల్, ఆదిబట్ల, తుక్కుగూడ, ఆమనగల్లు, షాద్‌నగర్, కొత్తూరు, శంషాబాద్, రాజేంద్రనగర్, శంకర్‌పల్లి, మణికొండ, బండ్లగూడ మున్సిపాలిటీలు ఉన్నాయి.

### త్వరలో ప్రత్యేకాధికారులు..

మున్సిపాలిటీల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారులను నియమించేందుకు జిల్లాయంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది. 13 మున్సిపాలిటీలు, 2 కార్పొరేషన్లకు ప్రత్యేకాధికారులను నియమించనున్నారు.

### ఇప్పట్లో ఎన్నికలు లేనట్టే..

మున్సిపల్ పాలకవర్గాల పదవీకాలం ముగియడంతో ప్రభుత్వం ప్రత్యేకాధికారుల నియామకంపైన దృష్టి పెట్టింది. ఇప్పట్లో మున్సిపాలిటీలకు ఎన్నికలు జరిగే అవకాశాలు లేవు. ప్రత్యేకాధికారుల పాలనలోగ్రామపంచాయతీలు, మండల పరిషత్‌లు, జడ్పీటీసీలకు ఎన్నికలు జరగాల్సి ఉన్నది.



మున్సిపల్ ప్రజాప్రతినిధులను సన్మానిస్తున్న అధికారులు